TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 26 సోమవారం అక్టోబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 166 తెలుగువారి పత్రిక..... మీ కోసం

సామాన్యుల కృషికి వందనం చేయడమే ‘మన్ కీ బాత్’..

ఇది ఒక తీర్థయాత్ర లాంటిది: 12 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని మోదీ

తన నెలవారీ రేడియో కార్యక్రమం ‘మన్ కీ బాత్’ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అనుభవాలను పంచుకున్నారు. ఈ ప్రయాణం తనకు ఒక ‘తీర్థయాత్ర’ లాంటిదని, దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సామాన్యులు చేస్తున్న అసాధారణమైన కృషిని గౌరవించుకునే మార్గమని ఆయన అభివర్ణించారు.నేడు ప్రసారమైన 139వ ‘మన్ కీ బాత్’ ఎపిసోడ్‌లో మాట్లాడుతూ, ఈ ప్రయాణంలో తనకు తోడుగా నిలిచి, స్ఫూర్తినిచ్చిన శ్రోతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.“పన్నెండేళ్ల క్రితం, విజయదశమి పర్వదినాన మనం ‘మన్ కీ బాత్’ ప్రారంభించాం. అప్పటి నుంచి మన ప్రయాణం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ ప్రయాణంలో మీరంతా సహ ప్రయాణికులుగా, స్ఫూర్తిదాతలుగా ఉన్నారు. శతాబ్దాలుగా మన దేశంలో తీర్థయాత్రల సంప్రదాయం ఉంది. మిగతా 2 లో

మక్కాపై దాడి చేయలేదు..

సౌదీ చమురు క్షేత్రాలే మా లక్ష్యం: హౌతీ రెబల్స్

ఇస్లాం పవిత్ర నగరాలైన మక్కా, మదీనాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామన్న వార్తలను యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటు దారులు ఖండించారు. తమ లక్ష్యం కేవలం సౌదీ అరేబియాలోని విమానా శ్రయాలు, చమురు శుద్ధి కర్మా గారాలు, సైనిక స్థావరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. మరోవైపు, మక్కా, మదీనా ప్రాంతాల దిశగా ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నామని, వాటి శకలాలు కింద పడ్డాయని సౌదీ అరేబియా ప్రకటించింది. శనివారం సౌదీ దళాలు రెండు బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో మక్కా సమీపంతో పాటు జెడ్డా, తాయిఫ్, రబీఘ్ ప్రాంతాల్లో క్షిపణి శకలాలు పడ్డాయని సౌదీ సివిల్ డిఫెన్స్ విభాగం తెలిపింది.

మిగతా 2 లో

భారత్-పాక్ మ్యాచ్‌లు క్రీడ కాదు.. రాజకీయ వ్యవహారం:



- -క్రీడల్లోకి రాజకీయాలు ప్రవేశించాయన్న కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్
- -గతంలో సంబంధాల మెరుగుకు వాడిన క్రికెట్‌ను ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శ
- -పాక్ ఆటగాళ్లతో కరచాలనం చేయకపోవడాన్ని తప్పుబట్టిన థరూర్
- -కార్గిల్ యుద్ధ సమయంలోనూ పాక్‌తో ఆడామని గుర్తుచేసిన కాంగ్రెస్ ఎంపీ

భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే క్రికెట్ మ్యాచ్‌లను ఇప్పుడు క్రీడా పోటీలుగా కాకుండా, రెండు దేశాల మధ్య ఓ రాజకీయ వ్యవహారంగా చూస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల మధ్య క్రికెట్‌లో రాజకీయాలు ఎంతగా పెరిగిపోయాయో ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. ముంబైలో జరిగిన లిట్‌ఫెస్ట్‌లో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు.“క్రికెట్‌ను రాజకీయాలకు, రాజకీయాలను క్రికెట్‌కు దూరంగా ఉంచడం అనేది జరగలేదు. క్రికెట్ ఇప్పుడు రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. అందుకే రాజకీయ సంబంధాలు ఉన్న వ్యక్తులే క్రికెట్ పాలనలో ఎక్కువగా కనిపిస్తున్నారు” అని థరూర్ విశ్లేషించారు. గతాన్ని గుర్తుచేస్తూ, ఒకప్పుడు ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచడానికి నాయకులు క్రికెట్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకునేవారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. చాలా అరుదుగా మ్యాచ్‌లు ఆడుతుండటంతో, ఎప్పుడు ఆడినా రాజకీయాలు తెరపైకి వచ్చి, మ్యాచ్‌కు జాతీయ స్థాయిలో భారీ ప్రాధాన్యం లభిస్తోందని ఆయన వివరించారు. మిగతా 2 లో

విశాఖకు 870 కి.మీ దూరంలో తీవ్ర వాయుగుండం..



- -బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం
- -దశలవారీగా బలపడి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం
- -అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే సూచన
- -గంటకు 140 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని అంచనా
- -మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ప్రభుత్వం హెచ్చరిక

ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది దశలవారీగా బలపడి “అతి తీవ్ర తుపాను”గా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొచ్చే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 28వ తేదీ ఉదయం బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే సూచనలు ఉన్నాయని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలకు ఆరెంజ్ మెసేజ్ జారీ చేసింది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ప్రచండ గాలులు వీచే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదివారం ఉదయం 11:30 గంటల సమయానికి ఈ తీవ్ర వాయుగుండం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 870 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 960 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. మిగతా 2 లో

అమెరికా, ఇజ్రాయెల్ మాకు నష్టపరిహారం చెల్లించాలి:

ఇరాన్ సుప్రీం లీడర్ డిమాండ్



- -న్యాయవ్యవస్థ చీఫ్‌తో మొజ్తబా ఖమేనీ భేటీ
- -దేశానికి కలిగించిన నష్టానికి తగిన పరిహారం రాబట్టేందుకు కృషి చేయాలని ఆదేశం
- -ఇరాన్ హక్కులను కాపాడటంలో రాజీ పడొద్దని సూచన
- -ఇరాన్‌పై మళ్లీ ‘ఎపిక్ ఫ్యూరీ’ తప్పదని ట్రంప్ హెచ్చరిక

అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఓవైపు, తమ దేశంపై అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన దాడులకు నష్టపరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేయగా, మరోవైపు ఇరాన్‌పై మళ్లీ సైనిక చర్య చేపట్టే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.

మిగతా 2 లో

కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్:

అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

- కేంద్ర ప్రాయోజిత పథకాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష
- నిధుల రికవరీ, వినియోగం వేగవంతం చేయాలని ఆదేశం
- కేంద్ర అధికారులతో సమన్వయం పెంచుకోవాలని సూచన
- అవసరమైతే కేంద్ర కార్యదర్శులతో తానే చర్చిస్తానని వెల్లడి
- హైదరాబాద్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం

కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అందాల్సిన నిధులను సత్వరమే రాబట్టి, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, నిధుల వినియోగాన్ని సీఎస్ సమీక్షించారు. లభ్యతలో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వాడుకోవడంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిధుల విడుదలకు అవసరమైన పరిపాలనాపరమైన ప్రక్రియలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులతో నిరంతరం సమన్వయం సాధించడం ద్వారా నిధుల విడుదలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. మిగతా 2 లో

ఇండియా బ్లాక్ ర్యాలీతో మాకు సంబంధం లేదు..

నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ సహా ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ర్యాలీతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఎంఐఎం పార్టీ చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. తాజా రాజకీయ పరిణామాలపై అసదుద్దీన్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై స్పందించారు. ఇండియా బ్లాక్ ర్యాలీతో మాకు ఎలాంటి సంబందం లేదు. . నేను సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నా. అందుకోసమే కోర్టులో కేసు వేశా. సర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై ప్రశ్నించాను.సీఈసీని నియమించడం దగ్గరి నుంచి సీఈసీకి చట్టపరమైన రక్షణ కల్పించడానికి కూడా నేను వ్యతిరేకం. అయితే, దీనికోసమే ఇండియా బ్లాక్ కూటమి చేపడుతున్న ర్యాలీతో మాకు ఎలాంటి సంబంధం లేదు అన్నారు. మిగతా 2 లో

రాహుల్‌గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారింది

రాహుల్ గాంధీ భారతదేశంలోనే అతిపెద్ద అబద్ధాలకోరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేందుకు ఖైరతాబాద్ యువ నాయకుడు జిబ్రాన్ షరీఫ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జిబ్రాన్ షరీఫ్‌కు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 2023 ఎన్నికలకు ముందు తెలంగాణలో గెలిచేందుకు రాహుల్ గాంధీ 420 వాగ్దానాలు చేశారు. వీటిలో 6 గ్యారంటీలు, 13 డిక్లరేషన్లున్నాయి.. వీటిని 100 రోజుల్లోగా నెరవేర్చాల్సి ఉంది.. కానీ 1,000 రోజులు గడిచినా ఒక్క వాగ్దానం కూడా నెరవేరలేదన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రజల ముందు రావడానికి భయపడుతున్నారన్నారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం రాహుల్ గాంధీ ఒక ఏటీఎం లాగా మారిందన్నారు. రేవంత్ రెడ్డి ఒక కార్డులాగా పనిచేస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ ప్రజల సొమ్మును దోచుకుంటోందని, రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ట్రంప్‌పై ఒబామా తీవ్ర విమర్శలు..

అది మోసపూరిత పాలన అంటూ ఫైర్

- ఒహాయో ర్యాలీలో ట్రంప్‌పై తీవ్రంగా విరుచుకుపడిన ఒబామా
- ఇరాన్‌తో అనవసర యుద్ధాన్ని ట్రంప్ ప్రారంభించారని ఆరోపణ
- సుంకాల వల్ల వినియోగదారులపైనే భారమన్న మాజీ అధ్యక్షుడు
- స్వప్రయోజనాల కోసమే ట్రంప్ అధ్యక్ష పదవిని వాడుకుంటున్నారని విమర్శ
- నవంబర్ 3 మధ్యంతర ఎన్నికలే చివరి అవకాశమని వ్యాఖ్య

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం ఒహాయోలోని క్లీవ్‌ల్యాండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై నిప్పులు చెరిగారు. ముఖ్యంగా ఇరాన్‌తో ఉద్రిక్తతలు, సుంకాల విధింపు, అధ్యక్ష పదవిని స్వప్రయోజనాలకు వాడుకోవడం వంటి అంశాలపై ఒబామా తీవ్ర ఆరోపణలు చేశారు. మిగతా 2 లో

భారత్-పాక్ మ్యాచ్‌లు క్రీడ కాదు.. రాజకీయ వ్యవహారం: శశి థరూర్ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఆసియా కప్ వంటి టోర్నీల్లో పాకిస్థాన్ ఆటగాళ్లతో భారత ఆటగాళ్లు కరచాలనం చేయకపోవడాన్ని తాను గతంలోనే విమర్శించిన విషయాన్ని థరూర్ మరోసారి గుర్తుచేశారు. ఆ విధానంలో అర్థం లేదని తాను వాదించినట్లు తెలిపారు. 1999లో కార్గిల్ యుద్ధం జరుగుతున్న సమయంలో కూడా భారత్, పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడిందని ఆయన ప్రస్తావించారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్ పట్ల మెతక వైఖరి అవలంబిస్తోందని బీజేపీ ఆరోపించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

అమెరికా, ఇజ్రాయెల్ మాకు నష్టపరిహారం చెల్లించాలి: ఇరాన్ సుప్రీం లీడర్ డిమాండ్

మొదటిపేజీ తరువాయి

శనివారం ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ, దేశ న్యాయవ్యవస్థ చీఫ్ ఘోలమ్‌హొస్సేన్ మొహ్సేనీ-ఎజెయితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఖమేనీ మాట్లాడుతూ.. అమెరికా-ఇజ్రాయెల్ నేరగాళ్లు తమ దేశానికి కలిగించిన భౌతిక, ఇతర నష్టాలకు తగిన పరిహారం రాబట్టేందుకు తీవ్రంగా కృషి చేయాలని ఆదేశించారు. ఇరాన్ ప్రజల హక్కులను కాపాడటంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అవినీతి నిర్మూలన, న్యాయ వ్యవస్థలో సంస్కరణలు వంటి అంశాలపై కూడా చర్చించారు.మరోవైపు, శుక్రవారం ఫ్లోరిడాలో జరిగిన ఓ ర్యాలీలో డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఇప్పుడు ఇరాన్ పెద్దగా ఏమీ చేయలేని స్థితిలో ఉంది. మేం తలుచుకుంటే, వాళ్ల ఆయిల్ మొత్తాన్ని స్వాధీనం చేసుకోగలం. లేదా మొత్తం దేశాన్నే మా ఆధీనంలోకి తీసుకోగలం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా "ఎపిక్ ఫ్యూరీ" పేరుతో భారీ సైనిక ఆపరేషన్ ప్రారంభించిన విషయాన్ని ట్రంప్ గుర్తుచేశారు. "మరో చిన్న ఎపిక్ ఫ్యూరీ"కి దిగే అవకాశం ఉందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై మరోసారి దాడులు చేసేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాలు ప్రణాళికలు రచిస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. అయితే, ట్రంప్ అంతిమంగా మరో సైనిక చర్యకు ఆదేశిస్తారా? లేదా? అనే దానిపై అనిశ్చితి కొనసాగుతోందని అమెరికా మీడియా పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా టెహ్రాన్ సహా ఇతర ఇరాన్ నగరాలపై దాడులు చేశాయి. దీనికి ప్రతిగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయెల్, ఈ ప్రాంతంలోని అమెరికా స్థావరాలపై దాడులు చేయడంతో పాటు, హర్మూజ్ జలసంధిపై పట్టు బిగించింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలు మరింత ముదిరే ప్రమాదం కనిపిస్తోంది.

కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్: అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి

అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో తానే స్వయంగా చర్చిస్తానని, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ట ప్రయోజనాలను పొందడమే లక్ష్యంగా ఈ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు మహేశ్ దత్ ఎక్కా, దాన కిశోర్, రాహుల్ బొజ్జా, సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు 870 కి.మీ దూరంలో తీవ్ర వాయుగుండం.. ఐఎండీ అప్ డేట్

మొదటిపేజీ తరువాయి

. అదేవిధంగా, మచిలీపట్నానికి 1,060 కిలోమీటర్లు, బాపట్లకు 1,130 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం గంటకు 5 కిలోమీటర్ల నెమ్మది వేగంతో నైరుతి దిశగా కదులుతున్న ఈ వ్యవస్థ, సోమవారం (అక్టోబర్ 26) ఉదయానికి తుపానుగా మారనుంది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ తుపాను అక్టోబర్ 27 ఉదయానికి తీవ్ర తుపానుగా, అక్టోబర్ 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి, ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోకి రానుంది. అక్టోబర్ 28వ తేదీ మధ్యాహ్నంలోపు బాపట్ల-విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఇది తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) ముందస్తు చర్యలు చేపట్టింది. తుపాను తీవ్రత దృష్ట్యా ప్రజలు, ముఖ్యంగా తీరప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే వేటకు వెళ్లిన వారుంటే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని కోరింది. "బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాల్లో జాగ్రత్తగా కట్టి ఉంచాలి. సముద్ర తీరాల్లో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది కాబట్టి, బీచ్‌ల వద్ద సెల్ఫీలు దిగే ప్రయత్నం చేయరాదు" అని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.తుపాను కదలికలను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నామని, ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాల సహాయక చర్యలకు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. తీరప్రాంత జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సామాన్యుల కృషికి వందనం చేయడమే 'మన్ కీ బాత్'.. ఇది ఒక తీర్థయాత్ర లాంటిది: 12 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని మోదీ

- -12 ఏళ్లు పూర్తి చేసుకున్న 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమం
- -ఈ ప్రయాణం ఒక తీర్థయాత్ర లాంటిదని అభివర్ణించిన మోదీ
- -సామాన్యుల అసాధారణ కృషిని దేశం ముందుంచే గొప్ప అవకాశమని వెల్లడి
- -శ్రోతలు చూపిన ఆత్మీయత, అనురాగం తనకు అమూల్యమైన ఆస్తి అని వ్యాఖ్య
- -కుటుంబ సభ్యుడిలా దేశ ప్రజలతో కనెక్ట్ అయ్యే అవకాశం లభించిందన్న ప్రధాని

సమాజం కోసం, దేశం కోసం జీవించే వ్యక్తులు స్వయంగా పుణ్యక్షేత్రాల వంటివారు " అని ప్రధాని పేర్కొన్నారు.దేశంలోని సామాన్య ప్రజల కృషినీ, ధైర్యాన్ని, అంకితభావాన్ని, సేవా స్ఫూర్తిని చాటి చెప్పేందుకు 'మన్ కీ బాత్' ఒక అద్భుతమైన అవకాశమని ప్రధాని వివరించారు. ఈ 12 ఏళ్లలో, సమాజం దృష్టికి రాని ఎందరో మహానుభావుల అసాధారణమైన పనులను ఈ కార్యక్రమం ద్వారా దేశం ముందుంచామని గుర్తుచేశారు. "ఈ కార్యక్రమం ద్వారా నేను ఒకరకంగా మన దేశ ప్రజల శక్తికి నివాళులు అర్పిస్తున్నాను. దేశంలోని ప్రతి కుటుంబంతోనూ అనుబంధం పెంచుకునే అవకాశం నాకు లభించింది" అని తెలిపారు.చాలా మంది ప్రజలు తనకు సందేశాలు పంపుతూ.. 'మన్ కీ బాత్' వింటున్నప్పుడు, తమ మధ్యలో ఒక కుటుంబ సభ్యుడిగా కూర్చుని మాట్లాడుతున్నట్లు అనిపిస్తుందని చెబుతుంటారని మోదీ ఆనందం వ్యక్తం చేశారు. "శ్రోతలైన మీ అందరి ఆత్మీయత, అనురాగం నాకు నిజంగా అమూల్యమైన ఆస్తి" అని ప్రధాని భావోద్వేగంగా అన్నారు. తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమం 2014 అక్టోబర్ 3న విజయదశమి రోజున ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్‌లలో ప్రసారమైన విషయం తెలిసిందే.

ఇండియా బ్లాక్ ర్యాలీతో మాకు సంబంధం లేదు.. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ వెల్లడి

మొదటిపేజీ తరువాయి

ఇదే సమయంలో ప్రస్తుతం జేఎన్‌యూలో జరుగుతున్న కాశ్మీర్ ఫ్రీ గ్రాఫిటీ అంశంపై కూడా అసదుద్దీన్ మాట్లాడారు. కాశ్మీర్‌ను వేరు చేయాలంటూ యూనివర్సిటీలో రూపొందిన గ్రాఫిటీకి ఎవరు బాధ్యులు..? యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్. ఆ ఇద్దరూ ఆర్‌ఎస్‌ఎస్ ముస్లిం రాష్ట్ర మోర్చా సభ్యులే. వారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలి. జేఎన్‌యూ విద్యార్థులు చేస్తున్న ఆందోళనలో న్యాయం ఉంది.ఈ విషయాన్ని విస్మరించడానికి వీల్లేదు. షర్జీల్ ఇమామ్ సిద్ధాంతాలపై మీకు వ్యతిరేకత ఉండొచ్చు. అది మీకు నచ్చకపోవచ్చు. అంతమాత్రాన అతడికి అదే అంశంపై న్యాయం జరగకుండా అడ్డుకోవడం సరికాదు. న్యాయం చేయడం అనేది కోర్టుల పని. ఆ కేసు విచారణ కొనసాగనివ్వండి. కనీసం అది కూడా జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారు అంటూ అసదుద్దీన వ్యాఖ్యానించారు. ఇక.. నవంబర్ 1న ఢిల్లీ, రాంలీలా మైదానంలో ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో ర్యాలీ జరగనుంది. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర కూటమి పార్టీల నేతలు ఇందులో పాల్గొననున్నారు.

ట్రంప్‌పై ఒబామా తీవ్ర విమర్శలు.. అది మోసపూరిత పాలన అంటూ ఫైర్

- -ఒహాయో ర్యాలీలో ట్రంప్‌పై తీవ్రంగా విరుచుకుపడిన ఒబామా
- -ఇరాన్‌తో అనవసర యుద్ధాన్ని ట్రంప్ ప్రారంభించారని ఆరోపణ
- -సుంకాల వల్ల వినియోగదారులపైనే భారమన్న మాజీ అధ్యక్షుడు
- -స్వప్రయోజనాల కోసమే ట్రంప్ అధ్యక్ష పదవిని వాడుకుంటున్నారని విమర్శ
- -నవంబర్ 3 మధ్యంతర ఎన్నికలే చివరి అవకాశమని వ్యాఖ్య

మొదటిపేజీ తరువాయి

"ఎవరూ కోరని, ఎవరూ ఓటు వేయని అనవసరమైన యుద్ధానికి" ట్రంప్ తెరలేపారని ఒబామా విమర్శించారు. తన హయాంలో కుదుర్చుకున్న అణు ఒప్పందం కారణంగా ఒక్క క్షిపణిని కూడా ప్రయోగించాల్సిన అవసరం లేకుండానే ఇరాన్‌ను అణ్వాయుధాల తయారీ నుంచి నిరోధించగలిగామని ఆయన గుర్తుచేశారు. అయితే, గత ఏడు నెలలుగా సాగుతున్న ఘర్షణల వల్ల మిత్రదేశాలు, అమెరికా సైనిక స్థావరాలపై దాడులు జరిగాయని.. ఈ క్రమంలో అమెరికన్లు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా పలువురు గాయపడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు పట్టుచిక్కడం వల్లే చమురు, డీజిల్ ధరలు పెరిగాయని మండిపడ్డారు.ట్రంప్‌కు "సుంకాలంటే అమితమైన ఇష్టం" అని, అయితే వాటి భారం అంతిమంగా వినియోగదారులపైనే పడుతుందని హెచ్చరించినా ఆయన పట్టించుకోలేదని ఒబామా ఎద్దేవా చేశారు. ట్రంప్ పాలనను ఒక "మోసపూరిత వ్యవస్థ" (గ్రిఫ్టర్ ప్రెసిడెన్సీ) గా అభివర్ణించిన ఆయన, అధ్యక్ష పదవిని ట్రంప్ స్వప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. మీమ్ కాయిన్లు, తన సంతానానికి చెందిన కంపెనీలకు పన్ను చెల్లింపుదారుల నిధులతో కాంట్రాక్టులు కట్టబెట్టడం, వెనిజులాకు చెందిన బిలియనీర్‌కు క్షమాభిక్ష ప్రసాదించడం వంటి అంశాలను ఈ సందర్భంగా ఒబామా ఉదహరించారు.నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికలు ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డుకట్ట వేయడానికి లభించిన ఆఖరి అవకాశమని ఒబామా పేర్కొన్నారు. ఈ ర్యాలీలో ఒహాయో గవర్నర్ అభ్యర్థి అమీ యాక్టన్, సెనేట్ అభ్యర్థి షెర్రాడ్ బ్రౌన్‌లకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. క్లీవ్‌ల్యాండ్ సభ అనంతరం ఆయన మిషిగాన్‌లోని డెట్రాయిట్‌లో జరగనున్న ప్రచార కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

మక్కాపై దాడి చేయలేదు.. సౌదీ చమురు క్షేత్రాలే మా లక్ష్యం: హౌతీ రెబల్స్

మొదటిపేజీ తరువాయి

యన్బు, తాయిఫ్‌లను లక్ష్యంగా చేసుకుని ప్రయోగించిన రెండు క్షిపణులను నాశనం చేశామని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు పేర్కొన్నాయి.అయితే, ఈ దాడులపై హౌతీ సైనిక ప్రతినిధి యహ్యా సరీ భిన్నమైన ప్రకటన చేశారు. తాము రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయం, యన్బులోని అరామ్‌కో చమురు కేంద్రం, రబీఘ్ ఆయిల్ రిఫైనరీ, పలు చమురు పంపింగ్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు తెలిపారు. దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ విమానాశ్రయం, నజ్రాన్‌లోని ఎయిర్‌పోర్ట్‌పైనా దాడి చేశామన్నారు. అయితే, ఈ దాడులు లక్ష్యాన్ని చేరుకున్నాయా? లేదా? అనేదానిపై సౌదీ అధికారులు స్పష్టత ఇవ్వలేదు.ఈ ఘర్షణలు యెమెన్ దక్షిణ ప్రాంతానికీ విస్తరించాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఏడెన్ నగరంలోని కోస్ట్ గార్డ్ ప్రధాన కార్యాలయంపై మూడు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. సౌదీ అధికారులు ఉన్న సైనిక శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు.2022లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఈ దాడులతో మరింత బలహీనపడింది. యెమెన్‌లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వానికి సౌదీ సంకీర్ణ దళాలు మద్దతిస్తుండగా, రాజధాని సనాతో పాటు ఉత్తర యెమెన్‌లో అధిక భాగం హౌతీల నియంత్రణలో ఉంది. కాగా, పవిత్ర నగరాలను లక్ష్యంగా చేసుకోవడం తమ ఉద్దేశం కాదని, అలాంటి వార్తలు అవాస్తవమని హౌతీలు పునరుద్ఘాటించారు.

అయ్యప్ప స్వాముల మహా పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్

ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్ష

పటాన్‌చెరు, అక్టోబర్ 25 (తెలంగాణ మంజీరా)

పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన అయ్యప్ప స్వాములు బీహెచ్‌ఈఎల్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శబరిమల సన్నిధానం వరకు చేపట్టిన మహా పాదయాత్రలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, అయ్యప్ప మాలధారణ భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మనిగ్రహాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో చేపట్టే మహా పాదయాత్ర ఐక్యత, సహనం, సేవాభావాన్ని మరింత పెంపొందిస్తుందని తెలిపారు.అయ్యప్ప స్వాములు నియమ నిష్ఠలతో శబరిమల యాత్రను విజయవంతంగా పూర్తి చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్వాములు చేసిన "స్వామియే శరణం అయ్యప్ప" నామస్మరణతో ఆలయ పరిసరాలు భక్తిభావంతో మార్మోగాయి.ఈ కార్యక్రమంలో మల్లేష్, శ్రీనివాస్, మహేష్, భాను, కిషోర్‌తో పాటు ఎంఆర్‌పీ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపును అడ్డుకోవాలి

డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

అర్హులైన ఓటర్ల ఓటు హక్కును కాపాడాలి

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నాయకుల ఆందోళన

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారంటూ ఆరోపించారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, దాని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐసీసీ అధికార ప్రతినిధి శరణ్ పాటిల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రీతం, అంజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్,కిరణ్ గౌడ్,వినోద్ పటేల్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భవాని మందిరంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

సదాశివపేట, తెలంగాణ మంజీరా న్యూస్ :

పట్టణంలోని హాట్కర్ పేట భవసాగర్ క్షత్రియ సమాజ్‌కు చెందిన శ్రీ భవాని మందిరంలో పౌర్ణమి ఆదివారం సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వ హించారు. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ భవాని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురా రోగ్యాలతో ఉండాలని, పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మ వారిని ప్రార్థించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెల కొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీ భవాని అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ శాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, శంకర్ గౌడ్, అర్జున్, తులసి దాస్, హరి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్, తెలంగాణ మంజీరా న్యూస్ :

నగల్ గిద్దా మండల పరిధిలోని పరిధిలోని ఇరాక్‌పల్లి మెగా నాయక్ తండాలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ తండాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, కిషన్ నాయక్ తండాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఇరాక్‌పల్లి మెగానాయక్ తండాలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ.8.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్డు, కిషన్ నాయక్ తండాలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, కారోబరి తండాలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డులను ప్రారంభించారు. కిషన్ నాయక్ తండాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వ రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థ మరింత సులభతరం కావడంతో పాటు అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. తండాలు, గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మండలానికి సంబంధించిన సర్పంచులు,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, తండాల ప్రజలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిల్లాలో స్వేచ్ఛారథం ప్రారంభం

-ప్రచార వాహనంతో అవగాహన-జిల్లా అదనపు కలెక్టర్ పాండు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

పెట్టి చాకిరీ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించడం, బాధిత కార్మికులకు అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలపై వివరించి, బాండెడ్ లేబర్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 080-69434343 కాల్ చేసి వివరాలు తెలుసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పాండు అన్నారు. ఆదివారం జిల్లాలో 'స్వేద్ఛారథం' ప్రచార వాహనాన్ని పాండు జెండా ఊపి ప్రారంభించారు. ప్రచార వాహనం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ వెట్టిచాకిరీ, కార్మికుల హక్కులు, కార్మిక దోపిడీకి గురైన సందర్భాల్లో ఫిర్యాదు చేసే విధానాలు, బాధితులకు అందుబాటులో ఉన్న రక్షణ, సహాయ వ్యవస్థలపై ప్రజలకు, ముఖ్యంగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు. వెట్టిదాకిరీని నిషేధిస్తూ చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో ఇటువంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులను సమగ్రంగా విచారించడం, బాధితులను రక్షించడం, వారికి పునరావాసం కల్పించడం, అవసరమైన సహాయాన్ని అందించడం కోసం జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ యాదయ్య పాల్గొని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. పెట్టిదాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయడం ప్రభుత్వ అధికారుల బాధ్యతని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. జిల్లాస్థాయి ప్రారంభ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు, డీఎస్పీ సతయ్య, పోలీసు శాఖ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మహిళా, శిశు అభివృద్ధి శాఖ, బాలల సంక్షేమ కమిటీ, తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్మికులకు తమ హక్కులపై అవగాహన లేకపోవడం, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థల గురించి తెలియకపోవడం వంటి వాటిని ప్రజలకు తెలుపాలని కోరారు. ప్రజలు అనుమానిత వెట్టిచాకిరీ ఘటనలను గుర్తించినప్పుడు బాండెడ్ లేబర్ హెల్ప్ లైన్ నంబర్ 080-69434343 ద్వారా సమాచారం తెలుసుకోవాలని కోరారు.

బీరంగూడ పర్యటనలో హరీష్ రావు

-బిఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం -కాశీ విశ్వేశ్వర పంచముఖి ఆంజనేయ ఆలయంలో వైభవంగా పూజలు..!

-ప్రత్యేక పూజలో పాల్గొన్న హరీష్ రావు బిఆర్ఎస్ ముఖ్య నేతల భేటీ

పటాన్ చెరు, తెలంగాణ మంజీరా న్యూస్

అమీన్ పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ పర్యటంలో భాగంగా మాజీ మంత్రి టి.హరీష్ రావు శ్రీ లక్ష్మీ గణపతి సహిత శ్రీ కాశీ విశ్వేశ్వర శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం సందర్శించారు.

ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివార్లకు హరీష్ రావు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ పండితులు వేదమంత్రాలు నడుమ ఆయనకు శేష వస్త్రాలు అందజేసి తీర్థప్రసాదాలు ఇచ్చి వేద ఆశీర్వాదం అందజేశారు. అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

నందారం నరసింహా గౌడ్ నివాసంలో హరీష్ రావు ఆత్మీయ విందు..

పర్యటన ముగించుకున్న అనంతరం అమీన్పూర్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ నివాసానికి హరీష్ రావు విచ్చేసి మధ్యాహ్న ఆత్మీయ భోజనం స్వీకరించారు. ప్రముఖ నేతల భాగస్వామ్యం, ఈ విందు కార్యక్రమంలో హరీష్ రావు తో పాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎర్రోళ్ల శ్రీనివాస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగా రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మనిషికి ఖుషి ఉంటే... ఋషులౌతారు..!

-రెండు మర్రి చెట్టుల మద్య వాల్మీకి తపస్సు -ఆ మర్రి ఈ మర్రితో రామ రామ రామాయణం...

ఘనంగా వాల్మీకి జయంతి

జహీరాబాద్, తెలంగాణ మంజీరా న్యూస్ :

రత్న కరుడు (అడవిలో వేట) చేస్తూ జీవనం సాగించేవారు. ఏకాగ్రతతో మనిషికి ఖుషి ఉంటే ఋషులు అవుతారు. ఆడవిలో వేట చేస్తూ నారద మునికి కనిపించాడు. అప్పుడు పాపం, పున్యం పై వేసిన చిక్కుముడి ప్రశ్నతో ఏమి సమాధానం చెప్పలేక అప్పుడు రత్నకరుడు ఏకాగ్రతతో తపస్సు చేస్తూ రామాయణం రచించారు. వాల్మీకి మహాముని జయంతిని రంజోల్ ముదిరాజ్ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆయన చేసిన తపస్సును గుర్తు చేశారు. వాల్మీకి మహాముని చేసిన తపస్సు రెండు మర్రి చెట్టుల మద్య కూర్చొని ఆ మర్రి ఈ మర్రి అంటూ... తపస్సుతో రామ రామ రామ రామాయణం రచించారని ముదిరాజ్ సంఘం సభ్యులు వివరించారు. నారదముని చెప్పిన ఒక మాటను జాగ్రత్తగా పాటించి ఒక యుగానికి రచించిన వాల్మీకి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎంబిబిఎస్ సీట్ సాధించిన వంశి యాదవ్ కు ఘన సన్మానం

జహీరాబాద్, తెలంగాణ మంజీరా న్యూస్:

స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలు కుమారుడు డాక్టర్ సీతారాం మేనల్లుడు జి.వంశీ మాధవ్ నీట్ పరీక్షలో ఎంబిబిఎస్ సీట్ సాధించారు. ఈ సందర్భంగా వంశీ మాధవ్ కు అదివారం జహీరాబాద్ లోని అతిథి హోటల్ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఘనంగా సన్మానించారు. అనంతరం శు భాకాంక్షలు తెలిపారు. డాక్టర్ సీతారాం సూచనల మేరకు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి ఏంబిబిఎస్ లో సీట్ సాధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హీరాలాల్ , రాష్ట్ర నాయకులు నిమ్మల కిష్టయ్య, జహీరాబాద్ డివిజన్ నాయకులు పాండు, నారాయణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఒప్పుకుంటున్నారా..? ఒప్పిస్తున్నారా..?

కొండాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్:

రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నారా..? లేక ఒత్తిడి చేసి ఒప్పిస్తున్నారా..? బలవంతపు భూసేకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయా..? మల్కాపూర్ రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 481 అసైన్డ్ భూముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జాతీయ రహదారికి ఆనుకుని ఉండటం, గిర్మాపూర్ శివారులో ట్రిపుల్ఆర్ సర్కిల్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో ఈ ప్రాంత భూములకు విలువ పెరిగింది. ఈ క్రమంలో సుమారు 203 ఎకరాల అసైన్డ్ భూముల్లో కొంత భాగాన్ని పారిశ్రామిక అవసరాలకు సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ సాగుతోంది.



గ్రామసభ తర్వాత మళ్లీ సర్వే!

జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 12 ఎకరాల 7 గుంటల భూములకు సంబంధించి సుమారు 16 మంది రైతుల అభిప్రాయాలు కీలకంగా మారాయి. దాదాపు రెండేళ్లుగా ఈ భూముల వ్యవహారం చర్చలో ఉండగా, సుమారు 15 రోజుల క్రితం నిర్వహించిన గ్రామసభలో రైతులు భూములు ఇచ్చేందుకు నిరాకరించినట్లు సమాచారం. రెవెన్యూ అధికారులు మరోసారి సర్వే నిర్వహించడంతో రైతుల్లో సందేహాలు పెరిగాయి. టీజీఐఐసీ ద్వారా ప్రైవేటు పరిశ్రమకు భూములు సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం ఉన్నప్పటికీ, దీనిపై అధికారిక ప్రతిపాదనలు, అనుమతుల వివరాలు వెల్లడికావాల్సి ఉంది. భూములు ఇవ్వకపోతే నోటీసులు ఇస్తామని, అవసరమైతే భూములు తీసుకుంటామని చెప్పినట్లు కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై అధికారులు స్పందించాల్సి ఉంది.

రెండుపంటల భూములు వదులుకోలేం!

వ్యవసాయమే తమ కుటుంబాలకు జీవనాధారమని, రెండుపంటలు పండే భూములను వదులుకునేందుకు సిద్ధంగా లేమని రైతులు స్పష్టం చేస్తున్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, తమ బతుకుదెరువును దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవద్దని కోరుతున్నారు. తప్పనిసరిగా భూములు తీసుకోవాల్సి వస్తే ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించడంతోపాటు, భూములు కోల్పోయే ప్రతి కుటుంబానికి 600 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతుల ఆవేదన.. వారి మాటల్లోనే!

రైతు తోగర్పల్లి సాయిలు: "జాతీయ రహదారికి ఆనుకుని నాకు సుమారు 20 గుంటల భూమి ఉంది. ఎకరాకు కోట్ల రూపాయలు ఇస్తామని చెబుతున్నా భూమి ఇచ్చేందుకు సిద్ధంగా లేను. మా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ బతుకుతున్నాం. రెండుపంటలు పండే భూమి పోతే మా కుటుంబానికి జీవనాధారం ఉండదు. భూములు తీసు కోవాల్సి వస్తే మార్కెట్ ధర ప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలి."

రైతు రత్నయ్య: "మా భూముల్లో రెండు పంటలు పండుతున్నాయి. భూములు ఇచ్చే ఉద్దేశం మాకు లేదు. తప్పనిసరిగా తీసుకోవాల్సి వస్తే న్యాయమైన పరిహారంతోపాటు మా కుటుంబానికి 600 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి. మా అభ్యంతరాలను పట్టించుకోకుండా భూములు తీసుకుంటే ఎలా బతకాలి? రైతులకు భరోసా కల్పించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి."

అధికారుల వివరణపై ఆసక్తి!

సర్వే నంబర్ 481లో భూముల సమీకరణకు అధికారిక ప్రతిపాదన ఉందా? ఏ పరిశ్రమ కోసం భూములు అవసరమయ్యాయి? గ్రామసభలో ఎంతమంది రైతులు అంగీకరించారు? భూములు ఇవ్వడానికి నిరాకరించిన రైతులపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. గతంలోనూ ఈ భూముల వ్యవహారంపై సూర్య దినపత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. రైతుల హక్కులు, చట్టబద్ధమైన భూసేకరణ ప్రక్రియ, న్యాయమైన పరిహారంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

అంత ప్రాణభయం ఉంటే దేశం వదిలి వెళ్లిపో

జగన్ కు! కౌంటర్ ఇచ్చిన షర్మిల బంధువులు

(హైదరాబాద్ తెలంగాణ మంజీరా అక్టోబర్ 25)

షర్మిల కూతురు పెళ్లి వేదికతో ప్రాణహాని ఉందన్న వైఎస్ జగన్ లేఖపై కుటుంబ సభ్యులు మండిపడ్డారు. వైఎస్సార్ ఆదర్శాలకు ఇది విరుద్ధమంటూ ఇచ్చిన కౌంటర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.షర్మిల కుటుంబ సభ్యులు లేవనెత్తిన అంశాలుప్రాణహాని ఉందని భయపడే జగన్ ఆనాడు తండ్రిా= కంటే గొప్పవాడా శత్రువులను సైతం పెళ్లిళ్లకు ఆహ్వానాలు పంప లేదా వైఎస్ఆర్ తమ్ముళ్ల పిల్లలు, చెల్లెలు విమలమ్మ పిల్లల పెళ్లిళ్లు వైఎస్ ఇంట్లో జరగలేదా తమ్ముడు జార్జ్ రెడ్డి అనిల్ రెడ్డి పెళ్లి , విమలమ్మ కుమారుడు యువరాజ్ పెళ్లి , కూతురు దివ్య పెళ్లి, బావమరిది రవీంద్రనాథ్ రెడ్డి కొడుకు రఘుదీప్ వివాహం , తమ్ముడు వైఎస్ సుధీకర్ రెడ్డి కుమార్తె విరోనికా రెడ్డి పెళ్లిళ్లు వైఎస్ ఇళ్లలోనే జరిగాయి నీలా పెళ్లిళ్లను అడ్డుపెట్టుకుని ప్రాణహాని ఉందని ఆనాడుా రాజశేఖర్ రెడ్డి దాక్కోలేదు కదా మేనకోడలి పెళ్లికి ప్రాణహాని అని భయపడితే.. పెళ్లికి రాకుండా లేదా బెంగళూరు ప్యాలెస్ కి వెళ్లకుండా జగన్ 10 రోజులు ఎటైనా వెళ్ళిపోవచ్చు కదా బెంగళూరు యలహంక ప్యాలెస్ లో ఇద్దరి భవనాలు, చుట్టూ కాంపౌండ్ వేరు అని +శీశీస్త్రశ్రీవ మీుఙూం లో చూసినా ఎవరికైనా అర్థం అవుతుంది.షర్మిలా రెడ్డికి కాబోయే వియ్యంకులు ఇప్పటికే వెడ్డింగ్ కార్డులో షర్మిల యలహంక రెసిడెన్సీలో వివాహం అని కార్డులు ముద్రించి వారి కుటుంబ సభ్యులకు పంచుకున్నది కనిపించడం లేదా సెక్యూరిటీ పేరుతో కాబోయే వియ్యంకుల ముందు సోదరి షర్మిల పరువు తీయాలని చూడటం ఎంతవరకు సమంజసం ఇరువైపుల ముఖ్యమైన కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా పెళ్లి చేసుకోవాలని అనుకుంటే అడ్డుకునే కుట్రలు చేయడం ఏంటి పెళ్లికి రావడం ఇష్టం లేక సెక్యూరిటీ పేరుతో, ప్యాలెస్ నీది కాదు అనే పేరుతో ఈ దొంగ డ్రామాలు ఎందుకు పక్కనే ఉండి పెళ్లికి రాలేదు అనే ముద్రను కప్పిపుచ్చుకువడానికే మేనకోడలి పెళ్లిపై కుట్రలు చేస్తున్నావా ?నీకు ఈ వేడుక నచ్చకపోతే ఏ దేశం అయినా వెళ్లిపో. అంతేకాని ప్రాణహాని అని కుళ్ళు, కుతంత్రాలతో కుట్రలు మానుకో ! అని జగన్ లెటర్ కు షర్మిల వర్గం కౌంటర్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.కాగా, నవంబర్ 25న సోమల రఘురామ్ రెడ్డి, అంజిలి రెడ్డి వివాహం చేయాలని ఇరుకుటుంబాలు నిశ్చయించాయి. సెప్టెంబర్ 24న వీరి ఎంగేజ్ మెంట్ ఘనంగా నిర్వహించారు. డిసెంబర్ 5న రిసెప్షన్ వేడుక నిర్వహించనున్నారు.

గూడూరులో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశానిర్దేశం చేసిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

గూడూరు, తెలంగాణ మంజీరా అక్టోబర్ 25:

మహబూబాబాద్ నియోజకవర్గంలోని గూడూరు మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, వరంగల్--నల్గొండ--ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల మహబూబాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి, సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న వరంగల్--నల్గొండ--ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలు, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు, పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై ముఖ్య కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని, గ్రాడ్యుయేట్ ఓటర్లను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సత్యవతి రాథోడ్ సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మరియు బిఆర్ఎస్ శ్రేణులు

ఉద్యోగాలు లేవు.. ఉపాధి లేదు.. కరెంటు లేదు.. నీళ్లు లేవు

- కాంగ్రెస్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు: మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

పెద్దతండా తెలంగాణ మంజీరా కురవి,అక్టోబర్ 25

డోర్నకల్ నియోజకవర్గం, కురవి మండలంలోని పెద్దతండాలోని తన నివాసంలో లిమాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ మాట్లాడుతూవిద్యావంతులు, మేధావులు ఓటర్లుగా నమోదు చేసుకుని బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలితెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక, సామాన్య ప్రజలకు ఉపాధి లేక, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారునిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, విద్యార్థులకు న్యాయం చేస్తామని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు, అశోక్నగర్ సెంట్రల్ లైబ్రరీకి వచ్చి విద్యార్థులకు హామీలు ఇచ్చిన నాయకులు, నేడు ఆ హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు అక్టోబర్ నెలలో కూడా విద్యుత్ కోతలు, నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముందస్తు ప్రణాళికతో సమస్యలను ఎదుర్కోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు,ఈ పరిస్థితి కరోనా కంటే ప్రమాదకరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారురాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజల జీవితాలను భారంగా మార్చాయని, సన్నబియ్యం ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, దాన్ని ప్రజలకు, రైతులకు అవసరమైన విధంగా వినియోగించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు

కాంగ్రెస్ తెచ్చిన కరువుతో ప్రజలు సతమతం

ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఏర్పడిన పరిస్థితి అని విమర్శించారు,పాలన అంటే దోచుకోవడం, దాచుకోవడం, ఢిల్లీకి కప్పం కట్టడం కాదని, ప్రజల అవసరాలను గుర్తించి వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించడమే నిజమైన పాలన అని హితవు పలికారు

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించి, విద్యుత్, తాగునీరు, సాగునీరు, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు

బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఓటర్లుగా నమోదు చేసుకోండి

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి, ప్రజలకు మేలు చేసిన కేసీఆర్ నాయకత్వంలోని ప్రజారంజక పాలనను తిరిగి తీసుకురావాలనే ఆకాంక్ష ప్రజల్లో ఉందని పేర్కొన్నారుఈ నేపథ్యంలో పట్టభద్రులు, విద్యావంతులు, మేధావులు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 6వ తేదీ వరకు వేచి ఉండకుండా, సంబంధిత గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు మహబూబాబాద్ జిల్లాలోని పట్టభద్రులు ఈ ప్రక్రియను ఒక బాధ్యతగా తీసుకుని, తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు,బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎన్నికల్లో తమ బలాన్ని, ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారువిద్యావంతులు, మేధావులు రెండు చేతులూ జోడించి కోరుతున్నాను --- ఓటరుగా నమోదు చేసుకోండి.. మీ ఓటు హక్కును కాపాడుకోండి.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పోరాటంలో భాగస్వాములు కండి అని పిలుపునిచ్చారు సత్యవతి రాథోడ్ గారుకార్యక్రమంలో రాష్ట్ర బిఆర్ఎస్ యువ నాయకులు శ్రీరాం నాయక్ గారు, మరియు కురవి మండలంలోని నాయకులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

పూసల సంఘం భవన నిర్మాణానికి ఎంపీ నిధుల కేటాయిస్తా..

బోర్వెల్ కూడా వేయిస్తా- ఎంపీ గడ్డం వంశీపూసల సంఘం నూతన అధ్యక్షుడు కుమారస్వామికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అభినందనలు

పెద్దపల్లి తెలంగాణ మంజీరా అక్టోబర్ 25:

పూసల సంఘం నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కుమారస్వామి కి, నూతన కార్యవర్గ సభ్యులందరికీ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పూసల సంఘం ప్రతినిధులతో సమావేశమైన ఎంపీ గడ్డం వంశీకృష్ణ సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, భవన నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.గతంలో పూసల సంఘం భవన నిర్మాణం కోసం సంఘం ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిని గుర్తుచేస్తూ, పూసల సంఘం భవన నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి అవసరమైన నిధులను కేటాయించేందుకు కృషి చేస్తానని, సంఘం అవసరాల దృష్ట్యా బోర్వెల్ కూడా వేయిస్తానని హామీ ఇచ్చారు.పూసల సంఘం సభ్యుల ఐక్యత, సంఘం అభివృద్ధి ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, నూతన కార్యవర్గం సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. పూసల సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.సంఘం అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం చేస్తున్న కృషికి తన మద్దతు ఉంటుందని తెలిపారు.